నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 12 మే 2024 | YADADRI BHUVANAGIRI

ప్రచారం పరిసమాప్తం

మూగబోయిన మైక్‌లు.. డీజే సౌండ్లు

- జోరుగా ప్రజల్లోకి దూసుకెళ్లిన బీఆర్ఎస్
- నియోజకవర్గాల్లో 144 సెక్షన్ అమలు
- వైన్స్, బార్లు బంద్.. సీల్ వేసిన ఎక్సైజ్ అధికారులు
- నేడు కేంద్రాలకు పోలింగ్ సామగ్రి తరలింపు

యాదాద్రి భువనగిరి, మే 11 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. పార్టీల ఎలక్షన్ క్యాంపెయిన్‌కు తెరపడింది. శనివారం సాయంత్రం 6గంటలకు నియోజకవర్గాల్లో పార్టీల ప్రచారం పరిసమాప్తమైంది. బహిరంగ సభలు, సమావేశాలు, ప్రచార రథాలు. రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం, వాహనాలపై డిజిటల్ డిస్‌ప్లేలకు ఫుల్‌స్టాప్ పడింది. దాదాపు రెండు నెలలుగా మైక్‌లు, డీజేలతో ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ముఖ్యంగా బీఆర్ఎస్ కేడర్ జోరుగా ప్రచారం నిర్వహించింది. ఊరూరా తిరిగి ప్రజల్లోకి వెళ్లింది. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించింది. ఆత్మీయ సమ్మేళనాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జిల్లాలో పర్యటించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రచారంలో పాల్గొన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ జోరుగా ప్రచారం నిర్వహించారు. రోజుకు రెండు, మూడు మండలాల ప్రజలతో మమేకమయ్యాయి. బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు. శనివారం సాయంత్రం 5గంటలకు ఎక్సైజ్ అధికారులు వైన్స్, బార్లకు సీల్ వేశారు. 13న పోలింగ్ ముగిసే వరకు వైన్స్, బార్లు బంద్ చేపడుతారు.

144 సెక్షన్ అమలు

ప్రచారం ముగియడంతో సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వచ్చింది. పార్లమెంట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేశారు. నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడవద్దు. అభ్యర్థులు మాత్రం పోలింగ్ తేదీ వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించుకునే అవకాశం ఉంది. అభ్యర్థితోపాటు మరో నలుగురు పాల్గొనవచ్చు. స్థానికేతరులు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. పార్లమెంట్‌కు సంబంధించిన వాళ్లు కాకుండా ఇతర వ్యక్తులకు అనుమతి ఉండదు. కల్యాణ మంటపాలు, కమ్యూనిటీ హాళ్లు, హోటళ్లలో ఉన్నోళ్లు వెళ్లిపోవాలి. ఒకవేళ కనిపిస్తే పార్లమెంట్ పరిధి నుంచి బయటకు పంపించేస్తారు. బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం ఉంది. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే జిల్లాకు పోలీస్ బలగాలు వచ్చాయి.

ఇక ప్రలోభాల పర్వం..

ఎన్నికల క్యాంపెయిన్ ముగియడంతో పార్టీలు ప్రలోభ పర్వానికి తెరదీశాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. వివిధ రూపాల్లో తాయిలాలను అందించే పనిలో ఉన్నాయి. మద్యం, కానుకలు, ధన ప్రవాహం జోరుగా సాగనుంది. ఇతర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులను కూడా రప్పించే ప్రయత్నం చేస్తున్నాయి. బయట ప్రాంతాల్లో ఉన్నోళ్లకు రాను పోను ఖర్చులు చూసుకుంటామని చెబుతున్నట్లు తెలుస్తున్నది. అయితే ఓటుకు ఎంత పంచాలనేది ఆయా పార్టీలు తర్జన భర్జన పడుతున్నట్లు సమాచారం.

నేడు పోలింగ్ సామగ్రి తరలింపు

పోలింగ్ తేదీ సమీపించడంతో ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ ఫెసిలిటేషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని తరలించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రం వరకు పోలింగ్ సామగ్రిని తరలించనున్నారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్‌లు ఉండనుండగా, వాటిని కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించనున్నారు. మరోవైపు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్ షోలో అభివాదం చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రజలకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, పార్టీ నేత చింతల

బీఆర్ఎస్‌దే విజయం

- క్యామ మల్లేశ్ భారీ మెజారిటీతో గెలుస్తారు
- బడే భాయ్, చోటే భాయ్ ఆరోపణల్లో నిజం లేదని తేలిపోయింది
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- భువనగిరిలో భారీ రోడ్ షో, బైక్ ర్యాలీ

భువనగిరి కలెక్టరేట్/భువనగిరి అర్బన్, మే 11 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు విజయదుందుభి మోగించడం ఖాయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి భువనగిరి పట్టణంలోని పెద్ద చెరువు కట్ట సమీపం నుంచి ఏకే ఫంక్షన్ హాల్ వరకు శనివారం బైక్ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి గులాబీ శ్రేణులతో నిండిపోయింది. అనంతరం విలేకరుల సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను కూడా కొనసాగించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో పల్లె, పట్నం అనే తేడా లేకుండా విద్యుత్ కోతలు ఉన్నాయని, మంచినీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనికిరాడన్న విషయం ప్రజలకు అర్థమైందన్నారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ ఇద్దరూ కలిసి కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బలమైన నాయకుడైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కోల్పోయిన దానిని తిరిగి దక్కించుకునేందుకు ప్రజలు తాపత్రయపడుతున్నారని తెలిపారు.

ఆరోపణలు, అసత్యాలు తప్ప కేసీఆర్‌పై చిన్న మచ్చ కూడా లేదని తేలిపోయిందన్నారు. మోదీ మాటల్లో ఓటమి భయం కనిపిస్తున్నదని, కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలే కీలకంగా మారనున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 16 స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ ముందంజలో ఉన్నదని, భువనగిరి, నల్లగొండ స్థానాల్లో గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు జడల అమరేందర్, కొలుపుల అమరేందర్, ఎన్నబోయిన ఆంజనేయులు, కిరణ్‌కుమార్, పాండు, శ్రీనివాస్‌రెడ్డి, ఓంప్రకాశ్‌గౌడ్, వీరేశ్, శ్రీనివాస్, సూరజ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 11 : లోక్‌సభ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 2,141 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 18,08,585 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 8,98,416 మంది పురుషులు, 9,10,090 మంది మహిళలు ఉన్నారని అన్నారు. 46,665 మంది దివ్యాంగులు, 10,945 మంది 85 ఏండ్లు పైబడిన వారు, 79 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎస్ఎస్‌టీ, బీఎస్‌టీ, వీవీటీ, ఎఫ్ఎస్‌టీ 58 టీమ్‌లు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన కాకుండా పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు. మొత్తం 245 మంది సెక్టార్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని, ఒక సెక్టార్ అధికారి 10నుంచి 12 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించామన్నారు. 1,325 ప్రాంతాల్లో వీల్ చైర్లు ఏర్పాటు చేశామని, అంధులకు బ్రెయిలీ బ్యాలెట్ అందుబాటులో ఉంచామని తెలిపారు. సెక్టార్ ఆఫీసర్ల వద్ద కొన్ని రిజర్వ్ ఈవీఎంలను అందుబాటులో ఉంచామన్నారు. పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించి భువనగిరి పట్టణంలోని ఆరోరా హయ్యర్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ అకాడమీలో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎం యంత్రాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు 125 శాతం, వీవీ ప్యాట్లు 140 శాతం కమిషనింగ్ చేసి సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఇప్పటి వరకు 99.30 శాతం ఓటరు స్లిప్‌ల పంపిణీ పూర్తయిందన్నారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి 1,364 మందికి గాను 1,266 మంది, పోలింగ్ విధుల్లో ఉన్న 11,193 మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారని తెలిపారు. ఇప్పటి వరకు 14,68,69,825 రూపాయల విలువైన బహుమతులు, నగదు, లిక్కర్, డ్రగ్స్ సీజ్ చేసినట్లు చెప్పారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి లౌడ్ స్పీకర్లపై నిషేధం ఉంటుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. అభ్యర్థికి ఒక వాహనం తోపాటు నలుగురికి అనుమతి ఉంటుందన్నారు. 11న సాయంత్రం 5నుంచి 13న సాయంత్రం పోలింగ్ పూర్తయ్యే వరకు వైన్స్, బార్లు, కల్లు దుకాణాలు బంద్ చేయడం జరుగుతుందని తెలిపారు.

డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ జిల్లాలో 166 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్ ఉంటుందని, మిగతా పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్ర పోలీసు బందోబస్తు నిర్వహిస్తాయని అన్నారు. బయటి వారు ఉంటే పంపిస్తామని, మీడియా సిబ్బందికి పోలింగ్ కేంద్రంలో ఫొటోలు తీయడానికి అనుమతి లేదని అన్నారు. ఐదంచెల బందోబస్తు ఏర్పాట్లు ఉంటాయని, సెక్టార్ ఆఫీసర్లు, పోలీసు బృందాలతో కూడిన టీమ్‌లు, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, ఏసీపీల స్థాయిలో ఫ్లైకింగ్ ఫోర్స్, డీసీపీ, సీపీ, ఏడీజీ స్థాయిల్లో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. పోలింగ్ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రైవేటు పార్టీలకు అనుమతి లేదని తెలిపారు.